క్లుప్తంగా

బుగ్గవంకలో పిచ్చి మొక్కలను తొలగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరం నడిబొడ్డున ఉన్న బుగ్గవంక దోమల ఉత్పత్తి కేంద్రంగా మారి, పరివాహక ప్రాంతాల్లో పగటి పూట దోమలు విజృభిస్తున్నాయి. వెంటనే పిచ్చి మొక్కలనను తొలగించాలని కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుగ్గవంకలోకి మురుగు కాలువల ద్వారా నీరు చేరి, కంప చెట్లు, పిచ్చి మొక్కలతో అడవిలా మారిందన్నారు. దానికి తోడు జంతువులు, చికెన్ వ్యర్థాలను వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. నగరంలో సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాడ్, వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రతి రోజు వీధులలో ఫాగింగ్ చేసేవారన్నారు. బుగ్గవంక, కుంటల్లో, పెద్ద మురుగు కాలువల్లో ఆయిల్ బాంబ్స్, గంబూషియా చేపలు వదలాలన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ అధికారులు వీటిని పూర్తిగా విస్మరించారన్నారు. ప్రజలను సీజనల్ వ్యాధుల గురించి నగరపాలక ఆరోగ్యాధికారి అప్రమత్తం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా నగరపాలక కమిషనర్, ఆరోగ్య శాఖాధికారి దృష్టి సారించి సంబంధిత అధికారులను ఆదేశించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు అవసరం

– నేత్ర వైద్యులు కావ్య మాధురి

కడప కోటిరెడ్డిసర్కిల్: దీపావళి సందర్భంగా టపాసులు, ఇతర మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని ఎల్వీపీఈఐ కన్సల్టెంట్, అప్తమాలజిస్టు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి సూచించారు. సోమవారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ)లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కంటికి గాయమైతే చేయవలసినవి, చేయకూడనివి వివరించారు. టపాసులు కాల్చేటప్పుడు కంటికి గాయమైతే వెంటనే వైద్య సహాయం పొందాలన్నారు. కంటిని మృదువుగా కడగాలని, కన్ను నలపకూడదన్నారు. గృహ వైద్యాలు ఉపయోగించకూడదన్నారు. కంటి లోపలి తునకలను తొలగించవద్దన్నారు. గాయానికి నూనె, ఇతర క్రీములు పూయవద్దన్నారు. టపాకాయలు వెలిగించే సమయంలో కేవలం మందంగా ఉన్న నూలు దుస్తులు ధరించాలన్నారు. దుస్తులనూ బిగుతుగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో కడప ఎల్వీపీఈఐ హెల్ప్‌లైన్ నంబర్: 08562350600, 95158 89641లో సంప్రదించాల్సిందిగా ఆమె సూచించారు.

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి



చంద్రశేఖర్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎందరో విద్యార్థులను చిత్రకారులుగా, డ్రాయింగ్ మాస్టర్లుగా తీర్చిదిద్దిన దేవనేని చంద్రశేఖర్ సేవలు మరువలేనివని కడప ఎంఈఓ దిద్దకుంట గంగిరెడ్డి పేర్కొన్నారు. కడప మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న దేవినేని చంద్రశేఖర్ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రాయింగ్ మాస్టర్‌గా ఆయన ఎంతో మంది పిల్లలను చిత్రకారులుగా తీర్చిదిద్దరన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమణి మాట్లాడుతూ చంద్రశేఖర్ తమ విలువైన సమయాన్ని పాఠశాలకు కేటాయిస్తూ తోటి ఉద్యోగులతో స్నేహ పూర్వకంగా ఉంటారన్నారు. జిల్లాలో 120 మందికి పైగా విద్యార్థులను డ్రాయింగ్ మాస్టర్లుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం పరిశీలన

వల్లూరు (చింతకొమ్మదిన్నె): చింతకొమ్మదిన్నె మండలంలోని రసూల్ పల్లె గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ కులాయిబాబు, ఈఓఆర్డీ వెంకటసుబ్బారెడ్డి పరిశీలించారు. ఎంపీడీఓ సచివాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ ఖచ్చితంగా ఉదయం పది గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు బయోమెట్రిక్ హాజరు తప్పకుండా వేయాలని ఆదేశించారు. గ్రామ ప్రజలు వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చినప్పుడు వారితో వినయంగా మాట్లాడి వారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వల్లూరు (చింతకొమ్మదిన్నె): చింతకొమ్మదిన్నె మండల పరిధిలో ఉటుకూరు సమీపంలోని శుభం కల్యాణ మండపం వద్ద ప్రమాదవశాత్తు జాతీయ రహదారి డివైడర్‌ను ద్విచక్రవాహన దారుడు భగతసింగ్ నగర్‌కు చెందిన అన్వర్‌బాషా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదం అన్వర్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు.

దీపం..కళాత్మక రూపం!

● డిజైనర్ దీపాలకు పెరిగిన ఆదరణ
● మార్కెట్‌లో ఆకర్షణీయమైన ప్రమిదలు

కడప కల్చరల్: ప్రజల అభిరుచి వేగంగా మారుతోంది. కాలానుగుణంగా కొత్తకొత్త పద్ధతుల కోసం ప్రజలు చూస్తున్నారు. పండుగల్లో కూడా కొత్తదనం ప్రతిఫలించాలని కోరుకుంటున్నారు. ఇంతవరకు కేవలం దీపావళి అంటే మట్టి ప్రమిదల వరుసలుగానే భావించేవారు. అవి వెలుగుతూ కళకళలాడుతుంటే తమ జీవితాలు కూడా కళకళలాడుతాయని మురిసిపోయేవారు. ప్రస్తుతం వారి అభిరుచుల్లో కొత్తదనం కనిపిస్తోంది. దీనికి అనుగుణంగా మార్కెట్‌లో చిన్న ప్రమిదలతోపాటు కళాత్మకమైన పెద్ద పెద్ద ప్రమిదలను కూడా వెలిగించి ఆనందిస్తున్నారు. అందుకోసం టెర్రకోట వస్తువుల తయారీ దారులు ప్రత్యేకంగా పెద్ద పెద్ద (వెడల్పాటి) దీపాలను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని దాదాపు ప్రతి ప్రమిదలు అమ్మే దుకాణాల్లో పెద్ద ప్రమిదలు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని కొనుగోలు చేసేవారు కూడా ఇటీవల పెరిగారు. పైగా వీటిలో నూనె ఎక్కువగా పీల్చదు గనుక ఎక్కువ సేపు వెలుగుతాయి. అందుకే మహిళలు వీటిని కొనుగోలు చేస్తున్నారు.



ఆకర్షణీయమైన దీపావళి ప్రమిదలు







ఆకర్షించే డిజైన్లు

సాధారణ డిజైన్ గల మట్టి ప్రమిదల స్థానంలో నెమళ్లు, ఏనుగులు, తాబేళ్లు, పూలు, దేవతా రూపాలు ఇలా అందరినీ ఆకర్షించే డిజైన్లలో లభిస్తున్నాయి. దీంతో ఇటీవల కాలంలో ఇలాంటి ప్రమిదల జోరు పెరిగింది. యేటా ఈ పండుగ కోసం ప్రత్యేకించి ప్రధాన మార్కెట్లు, ప్రధాన రోడ్లు, కూడళ్లలో ప్రమిదల అమ్మకాలు జోరుగా ఉంటాయి.

రాజస్థాన్ దీపాలకు గిరాకీ

ప్రస్తుతం రాజస్థాన్ దీపాలకు మంచి గిరాకీ ఏర్పడింది. రకరకాల కళ్లు చెదిరే డిజైన్లు ఉండడంతో ప్రజలు వాటిపట్ల ఆకర్షితులవుతున్నారు. తాము కోరిన కళాత్మక రూపాల్లో దీపాలను వెలిగించుకోవాలని పలువురు ముచ్చట పడుతున్నారు. మట్టి దీపాలతోపాటు చిట్టి దీపాలు, పెద్ద దీపాలు వెరిసి మొత్తం వంద రకాల ప్రమిదలు అందమైన డిజైన్లలో లభిస్తున్నాయి. పెద్ద ప్రమిదలు ఒక్కొక్కటి రూ. 100–500 వరకు డిజైన్‌ను బట్టి అందుబాటులో ఉన్నాయి. కడప నగరంలోని అప్సర థియేటర్ పక్కన రోడ్డు వారగల షాపుతోపాటు కళాక్షేత్రం, వన్‌టౌన్ సర్కిల్, కృష్ణ థియేటర్, ఎర్రముక్కపల్లె, ఐటీఐ సర్కిల్ తదితర ప్రాంతాలలో తోపుడు బండ్లపై కూడా ప్రమిదలను విక్రయిస్తున్నారు.

యానిమేషన్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు

ఏఎఫ్‌యూ వీసీ జి. విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ: రానున్న రోజుల్లో యానిమేషన్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఏఎఫ్‌యూలో యానిమేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యానిమేషన ఎగ్జిబిషన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యానిమేషన్ పితామహుడు ఎమిలీకోలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ మార్కెట్‌లో చక్కటి డిమాండ్ ఉన్న కోర్సు యానిమేషన్ అన్నారు. విశ్వవిద్యాలయంలో యానిమేషన్ కోర్సు అందుబాటులో ఉండటం ఈ ప్రాంత విద్యార్థులకు వరమన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వీడియో గేమ్, సినిమాలు అద్భుతమైన కళారూపాల్లో యానిమేషన్ వినియోగంతో కొత్తపుంతలు తొక్కుతోందన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన 2డీ, 3డీ వీఎఫ్ఎక్స్ వర్క్స్‌ను వీసీ తదితరులు వీక్షించారు. కార్యక్రమంలో యానిమేషన్ విభాగం సమన్వయకర్త దినేష్, అధ్యాపకులు జనార్దన్, శాంతి, రవికుమార్, విద్యానంద్, సావిత్రి, శివకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



యానిమేషన్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వీసీ జి. విశ్వనాథకుమార్, అధ్యాపకులు

రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

– నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం వద్దనున్న రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి కోరారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన రైతు బజార్, ఐటీఐ సర్కిల్, కాగితాల పెంట, నాగరాజుపేట బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్ మెయిన్ గేట్ వద్ద చెత్త పాయింట్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, బ్లీచింగ్ కూడా చల్లాలన్నారు. రైతు బజార్‌లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రైతు బజార్ వెనుక భాగంలో పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐటీఐ గాంధీ పార్కు వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన టీ స్టాళ్లను వెంటనే తొలగించాలన్నారు. ఉదయం రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారి స్వీపింగ్ పూర్తిచేయాలన్నారు. కాగితాల పెంటలో ప్రజల ఫిర్యాదుల మేరకు రోడ్డు వెడల్పు చర్యలు తీసుకుని, ఎంక్రోచ్‌మెంట్ తొలగించేందుకు ప్లానింగ్ అధికారులకు తక్షణ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాగరాజుపేట బ్రిడ్జి వద్ద చెత్త వేయకుండా పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని, చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, కార్పొరేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రైతుబజార్ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

జాబ్‌డ్రైవ్‌లో పలువురికి ఉద్యోగ అవకాశం



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో పలువురు అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఆల్ డిక్షన్, యంగ్‌ఇండియా సంస్థలు, కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు 63 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూ ఆధారంగా 35 మంది అభ్యర్థులు ఆల్‌డిక్షన్ కంపెనీకి, మరో 23 మంది యంగ్ ఇండియా సంస్థలో ట్రైనీ మేనేజర్‌లుగా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, జేకేసీ కోఆర్డినేటర్ సీహెచ్ రాము, జేకేసీ మెంటార్లు డా. ఎస్. సారథి, రవీంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వేతనాలు పెంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి కోరారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో 104 ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. వెంటనే న్యాయం చేయాలన్నారు. 104 సేవలను ప్రభుత్వమే పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు మహ్మద్ అలీ, బాబావలీ, మహమ్మద్ అలీ, నాగమల్లేశ్వరరావు, మహబూబ్ బాషా, నాగేంద్ర, సురేష్ కృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



-మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులురెడ్డి

కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు

కమలాపురం: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నల్లింగాయపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రహమత్‌బషీర అన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై చేపట్టిన సర్వే గురించి జరిపిన కాంపిటీషన్‌లో గెలుపొందిన విజేతలకు హెచ్‌ఎం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి వీర నారాయణ, హ్యూమన్ రైట్స్ మండల చైర్మన్ సిద్దయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళిని సంతోషంగా జరుపుకోవాలి

– కడప రెవెన్యూ డివిజనల్ అధికారి

కడప కోటిరెడ్డిసర్కిల్: దీపావళిని ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ అన్నారు. సోమవారం స్థానిక కడప రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ఆవరణలోని థామస్ మన్రో మీటింగ్ హాల్లో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల కేటాయింపునకు రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి సమక్షంలో లక్కీడిప్ ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించి సిస్టం ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇచ్చిన లైసెన్స్ మాత్రమే ఉండాలని, లైసెన్స్, జీఎస్టీ లేని వారు బాణసంచా దుకాణం నిర్వహించారాదన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పక పాటించాలని, అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు, దుకాణం సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలన్నారు.

వేలం ద్వారా ఆలయానికి రూ 2.85 లక్షల ఆదాయం

చెన్నూరు (వల్లూరు): చెన్నూరు మండల పరిధిలోని శివాల్‌పల్లెలో వెలసిన శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాల సేకరణ హక్కు, కొబ్బరి కాయల విక్రయ హక్కులకు స్థానిక ఆలయ ప్రాంగణంలో సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే. శ్రీనివాసులు తెలిపారు. నవంబర్ 1 వ తేదీ నుంచి సంవత్సరం పాటు తలనీలాల సేకరణ, కొబ్బరి కాయల విక్రయ హక్కుల కోసం దేవాదాయ శాఖ కడప డివిజన్ ఇన్‌స్పెక్టర్ సీ. శివయ్య పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు. తలనీలాల సేకరణ హక్కు వేలంలో కే. క్రిష్ణయ్య రూ 1,05,900 దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొబ్బరికాయల విక్రయ హక్కు కోసం నిర్వహించిన వేలం పాటలో సుబ్బయ్య రూ 1, 80 ,000 లకు దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది తలనీలాల సేకరణ హక్కు వేలం పాట ద్వారా రూ 16,900, కొబ్బరి కాయల విక్రయ హక్కు వేలం పాట ద్వారా రూ 63,000 అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, సుదర్శన్, అర్చకులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి జైలు, జరిమానా

కడప అర్బన్: కుటుంబ కలహాలతో అత్తను రోకలి బండతో కొట్టి గాయపరిచిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ. 5వేలు జరిమానా విధిస్తూ సోమవారం రెండవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కె. భార్గవి తీర్పునిచ్చారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప టౌన్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సీఐ తేజోమూర్తి ఆధ్వర్యంలో కోర్టులో నిందితుడిని హాజరుపర్చగా నేరం రుజువైంది. భగత్ సింగ్ నగర్‌లో నివాసం ఉండే మంజుల శ్రీనివాసులు నెహ్రూ నగర్‌లో నివాసం ఉంటున్న తన అత్తపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనలో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ సంఘటన వివరాలను చిన్నచౌక్ సీఐ వెల్లడించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు.

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు.

సాయంత్రం 4గంటల వరకే ఉచిత ఇసుక

జమ్మలమడుగు: ఇంటి అవసరాల కోసం వినియోగదారులు పెన్నానదిలో గుర్తించిన పాయింట్‌లలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపే ఉచిత ఇసుకను తీసుకెళ్లాలని తహసీల్దార్ పి.శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇంటి అవసరాల కోసం పెన్నానదిలో మోరగుడి, కన్నెలూరు, గొరిగేనూరు వద్ద పెన్నానదిలో ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని సూచించారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న కమర్షియల్ షాపుల ట్రేడ్ లైసెన్స్‌లు సకాలంలో వసూలు చేయాలని, ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం పూర్తి చేయాలన్నారు. నగరంలో చెత్త పాయింట్లు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త ఎత్తిన చోట బ్లీచింగ్ చల్లాలని సూచించారు. టౌన్‌ప్లానింగ్‌లో వచ్చిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయిలో పర్యటించి సత్వరమే అప్రూవల్స్ ఇవ్వాలన్నారు. ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై ఉన్న ఆక్రమణలు తొలగించి, వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీటి సరఫరా సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, వీధుల్లో స్ట్రీట్ లైట్ల నిర్వహణ పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 32 అర్జీలు అందాయి. వాటిలో ఇంజినీరింగ్ విభాగం 14, టౌన్ ప్లానింగ్ విభాగం 8, రెవెన్యూ విభాగం 5, హెల్త్ విభాగం 4, యూపీఏ విభాగం 1 అర్జీని కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి విభాగాధిపతి తమకు చెందిన అర్జీలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కే. రాకేష్ చంద్ర, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం సహా వివిధ విభాగ అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

శ్రీరామయంత్రానికి ప్రత్యేక పూజలు

కడప కల్చరల్: అయోధ్యలోని శ్రీరామ మందిరంలో ప్రతిష్ట కోసం తీసుకు వెళుతున్న అత్యంత పవిత్రమైన శ్రీరామయంత్రాన్ని సోమవారం కడప కడప నగరానికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రికి కడప నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండరామాలయానికి చేరుకున్న యంత్రం గల వాహనాన్ని అక్కడే ఉంచి సోమవారం ఉదయం ప్రత్యేక పూజలనంతరం కడప నగరంలో పర్యటింపజేశారు. రాజీవ్‌మార్గ్, ఎర్రముక్కపల్లె మీదుగా పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వాహనం చేరుకుంది. భక్తులు అడుగడుగునా జయజయధ్వానాలు చేస్తూ వాహనం వెంట సాగారు. వాహనంలోని యంత్రాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అయోధ్యలో ఎక్కువ మంది భక్తుల తాకిడి ఉండడంతో అక్కడగల ఈ యంత్రాన్ని ఎక్కువ మంది దర్శించుకునే అవకాశం లేదని, ఈ యంత్రాన్ని కూడా ఆ ప్రాంగణంలో ప్రతిష్ట చేస్తే ఎక్కువ మంది దర్శించుకునే భాగ్యం లభిస్తుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. దాదాపు 150 కిలోల బరువుతో బంగారు పూతగల శ్రీరామ యంత్రం కంచిలో పీఠం 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజేయంద్ర సరస్వతి శంకరాచార్య ఆధ్వర్యంలో పూర్తి ఆధ్యాత్మిక జాగ్రత్తలతో తయారు చేసినట్లు తెలిపారు. ఇది తిరుపతిలోని శ్రీ కంచి కామకోటిపీఠం మహాపాదుకా మండపంలో నుంచి తీసుకు వస్తున్నారని తెలిపారు. నవంబరు 12వ తేదీ వరకు ఐదు రాష్ట్రాల ద్వారా దాదాపు 2 వేల కిలోమీటర్ల సుదీర్ఘ యానం అనంతరం అయోధ్యకు చేరుకుంటుందని, అక్కడ పతాకావిష్కరణతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.



శ్రీరామ యంత్రాన్ని దర్శించుకుంటున్న భక్తులు

'తల్లికి వందనం' వెంటనే అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశారు. సోయవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తల్లికి వందనం పథకం కింద పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి 15వేలు రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 4నెలల అవుతున్నా ఇదిగో తల్లికి వందనం అదిగో తల్లికి వందనం అంటూ విద్యాశాఖ మంత్రి నారలోకేష్ కల్లిబొల్లి మాటలు చెబుతూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలు తల్లితండ్రులకు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. గత ప్రభుత్వం అమ్మ ఒడి కింద ఇచ్చే విద్యార్థి వివరాలు ఉన్నాయని, ఆ వివరాలను తీసుకోని తల్లికి వందనం అమాలు చేయాలని డిమాండ్ చేశారు. విధి విధానాల పేరుతో రాష్ట్రంలో విద్యార్థులను మోసం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పవన్,ప్రశాంత్, అశోక్, కిషోర్ పాల్గొన్నారు.



బాలుర జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రైతుమార్కెట్‌లో స్వచ్ఛతా కార్యక్రమం

వైవీయూ: కడప నగరంలోని రైతుమార్కెట్‌లో నెహ్రూ యువకేంద్రం, స్వచ్ఛంద సేవాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో «దివాళి విత్ మై భారత్» కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ మాట్లాడుతూ భారత ప్రభుత్వ యువజన సర్వీసుల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనచుట్టూ ఉన్న ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం రైతుమార్కెట్‌లో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హ్యాండ్స్ పర్ యు స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు, కె. ఈశ్వరయ్య, విజయ్, శ్రీహరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ గణేష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా కార్యక్రమాల్లో నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు

అదనపు వర్కర్లకు పని భద్రత కల్పించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పని చేస్తున్న అదనపు వర్కర్లకు పని భద్రత కల్పించాలని సీఐటీయూ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, డెత్ స్కీం, బిడ్డలకు ఉద్యోగాలు కల్పించడంలో నగరపాలక సంస్థ విఫలమవుతోందన్నారు. కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్. కరిణ్, ఇ. ప్రకాష్, ఆనంద్, నాగరాజు, నరసింహులు, సాయి, నిత్యపూజయ్య, ఆదాము, మస్తాన్, పెద్దోడు, బాలాజీ, రమాదేవి, దస్తగిరమ్మ, సుంకన్న, నాగయ్య పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

పులివెందుల టౌన్: పట్టణంలోని దివ్యాంగుల సంఘం కార్యాలయంలో సోమవారం కుంచా సోమయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కుంచా సోమయ్య సేవలు వెలకట్టలేమని, మంచి మనసున్న వ్యక్తి, మనవతా మూర్తి, స్నేహశాలిగా కుంచా సోమయ్య మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన గతంలో పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కమిటీలో మెంబర్‌గా కూడా కొనసాగారని, అలాంటి మంచి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సోమయ్య కుటుంబ సభ్యులు శివ, శేఖర్, హరీష్, ఉమాదేవి ,చంద్రిక, సుమలిక, లోకేష్ తదితరులు ఉన్నారు.